సాక్షి
జనగామ

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



కొలువు కొట్టేయ్..
ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సుల కంటే.. ఐటీఐ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సులభంగా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.
- IIలో▸



చేపల వేటకు వెళ్లి..
చేపల వేటకు వెళ్లిన తండ్రీకొడుకుల్లో కుమారుడు నీటమునిగిపోతుండగా.. కాపాడ బోయిన తండ్రి గల్లంతయ్యాడు. ఈ ఘటన జేఎస్ భూపాలపల్లి జిల్లాలో జరిగింది.- IIలో▸

గరిష్టం/కనిష్టం
29^0 /24^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉండి పలుచోట్ల చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మాసం చివరి శనివారం భక్త జన సందోహం మధ్య అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరాగా చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన తంగళ్లపల్లి లక్ష్మి- రామస్వామి, వేణుగోపాల్, నాగశ్రీమాత, గగన్, శ్రీకాంత్ హైదరాబాదుకు చెందిన మంద నవ్య-నవీన్‌కుమార్‌రెడ్డిలు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. 30జంటలు కల్యాణంలో పాల్గొన్నాయి. ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులతో పాటు ఎడవెల్లి మాధవరెడ్డి- మణెమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

'పల్లా'ను కలిసిన పీఏసీఎస్ చైర్మన్ బృందం



జనగామ: జనగామ పీఏసీఎస్ పాలక మండలి బృందం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ గండి ప్రవీణ్, డైరెక్టర్లు మడిపెల్లి సుధాకర్‌గౌడ్, బంగి నాగభూషణం, సుశీల, పొన్నాల శ్రీమతి, ప్రభాకర్‌రెడ్డి, బుచ్చయ్య, రామచంద్రం, మునప్రసాద్, బుస్స ప్రవీణ్‌రెడ్డి పల్లాను కలిసి, సత్కరించారు. అనంతరం జనగామ బీఆర్‌ఎస్ టికెట్ విషయమై వారు చర్చించారు.

జయప్రదం చేయండి



పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ 38వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. శనివారం ఆయన ఐలమ్మ స్మారక భవనంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నేటి యువత ఐలమ్మ చరిత్రను తెలుసుకొని వారి ఆశయాల కోసం ముందుకు సాగాలని సూచంచారు. ఐలమ్మ వర్ధంతి సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, నాయకులు ఏదునూరి మదార్, లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువత భాగస్వామ్యానికి 'క్రియే-థాన్'




జనగామ రూరల్: ఎన్నికల ప్రక్రియలో యువత భాగస్వామ్యులను చేస్తూ వారిలో సృజనాత్మకతను వెలికి తీసే విధంగా ఎన్నికల సంఘం 'క్రియే-థాన్' పోటీలను నిర్వహిస్తుందని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను ఆసక్తి గల యువత పోస్టర్‌లేదా.. వీడియో చేయవచ్చునని తెలిపారు. ఇందులో ఓటరు లిస్టులో పేరు ఉన్నదా లేదా అని చెక్ చేసుకోవడం లేదా ఫారం 6 ద్వారా ఓటరు నమోదు చేసుకునే విధానం అందరికీ అర్థమయ్యేలా తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో తయారు చేసి ఎన్నికల సంఘానికి ఈనెల 16లోగా పంపించాలని సూచించారు. పోస్టర్ అయితే జేపీజీ, పీఎన్‌జీ పార్మట్‌లో 5ఎంబీ మించకుండా, వీడియో 60 సెకన్లు మించకుండా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఉత్తమమైన వాటికి రూ.20,000 అందజేస్తారని రాజకీయపార్టీ గుర్తులు, వ్యక్తులు, పార్టీల రంగులు ఉంటే తిరస్కరిస్తారని స్పష్టం చేశారు.

సర్టిఫికెట్ల పరిశీలన

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో టీఎస్ ఐసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం ప్రారంభమైంది. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం అభ్యర్థులకు ప్రిన్సిపాల్ ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ఆచార్యులు డాక్టర్ అంజన్‌రావు, డాక్టర్ చిర్రరాజు పాల్గొన్నారు.

టీఆర్టీలో 76 పోస్టులే..

జిల్లాలో 426 ఖాళీలు..
- నిరాశలో నిరుద్యోగులు
- ఈనెల 20 నుంచి దరఖాస్తుల ప్రక్రియ
- నవంబర్ 20న టీఆర్టీ పరీక్ష



జనగామ రూరల్: ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో బీఎడ్, డీఎడ్ పూర్తి చేసినవారిలో ఆశలు చిగురించాయి. చివరి సారిగా 2018లో టీఎస్పీఎస్సీ ద్వారా టీఆర్టీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) పరీక్ష నిర్వహించిన ప్రభుత్వం నేరుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టింది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేయనుంది. ఇప్పటికే టెట్ పరీక్షను ఈనెల 15వ తేదిన నిర్వహించేందుకు సిద్ధం కాగా తాజాగా టీఆర్టీ నోటిఫికేషన్‌తో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 76 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. ఈనెల 20నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. నవంబర్ 20వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షకు రెండు నెలలు గడువు ఉండడంతో అభ్యర్థులు కోచింగ్‌లకు సిద్ధం అవుతున్నారు. అయితే గతంతో పరీక్షా విధానం ఓఎంఆర్ ద్వారా నిర్వహించగా ప్రస్తుతం కంప్యూటర్ బెస్‌గా నిర్వహించనున్నారు.

పోస్టులు తక్కువ.. అభ్యర్థులు ఎక్కువ
ప్రభుత్వం వెలువరించిన నోటిఫికేషన్ పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడంతో డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు నిరాశలో ఉన్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్షలో ఇప్పటికే జిల్లాలో అర్హత సాధించిన వారు సుమారు 10వేల మందికి పైగా ఉన్నారు. కాగా ఈనెల 15న నిర్వహించే టెట్ పరీక్షతో ఈసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా ఎస్‌ఏ, ఎస్జీటీ పోస్టులు కలిపి 426 ఖాళీలు ఉన్నాయి. ప్రమోషన్స్, ద్వారా 215 భర్తీ కానుండగా మిగిలిన 211 పోస్టులు ఖాళీగా ఉంటాయి.. కానీ, కేవలం 76 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడంపై అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుల సంఖ్య పెంచాలని కోరుతున్నారు.

ఖాళీల వివరాలు

గెజిటెడ్ హెచ్‌ఎం	49	ఇంగ్లిష్	21
పీఎస్‌హెచ్‌ఎం	58	తెలుగు	14
ఎస్జీటీ	118	హిందీ	7
ఎస్‌ఏ పీడీ	5	తెలుగు పండిట్	12
పీఈటీ	7	హిందీ పండిట్	9
ఎస్‌ఏ మాథ్స్	20	ఆర్ట్	2
ఫిజిక్స్	8	క్రాఫ్ట్	2
బయోసైన్స్	39	ఒకేషనల్	2
సోషల్	53	మొత్తం	426

ఉపాధ్యాయుల కొరత
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల భర్తీ కనిపించడం లేదు. జిల్లాలోని పలు పాఠశాలల్లో గత నాలుగైదు ఏళ్ల నుంచి స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, వ్యాయాయ, ఉపాధ్యాయులు పదవి విరమణ పొందుతున్నారు. కానీ భర్తీ లేకపోవడంతో విద్యార్థుల చదువు, భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. దీనికి తోడు ఐదేళ్లకు పైగా ఉపాధ్యాయల నియామకాలు చేపట్టకపోవడంతో బోధన భారం పెరిగింది. జిల్లాలో మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు 508 ఉండగా.. అందులో సుమారు 2,185మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నట్లు అధికారుల గణాంకాలు తెలుపుతున్నాయి.



ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు

భర్తీ చేయనున్న పోస్టులు

ఎస్‌ఏ	23
భాషా పండిట్	17
వ్యాయామ	7
ఎస్జీటీ	29
మొత్తం	76

పోస్టుల సంఖ్య పెంచాలి



2018 తర్వాత నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో పోటీ తీవ్రంగా ఉంది. ప్రస్తుత నోటిఫికేషన్‌లో తక్కువ పోస్టులను భర్తీ చేస్తున్నారు.. పోస్టుల సంఖ్య పెంచాలి. ప్రభుత్వం అసెంబ్లీ చెప్పిన 11వేల పోస్టులు భర్తీ చేయాలి.

- బంద కవిత, జనగామ

సమయం తక్కువగా ఉంది.
ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం సంతోషంగా ఉంది. కానీ సమయం తక్కువగా ఉండడం వల్ల అధికంగా ఉన్న సిలబస్ సకాలంలో పూర్తి చేయడం కష్టం. పరీక్ష గడువు పొడిగించాలి. సబ్జెక్ట్ వారీగా పోస్టుల సంఖ్య పెంచాలి. నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చూడాలి.

- గుగ్గిళ్ల రవికుమార్, ఖిలాషాపురం, రఘునాథపల్లి

కాంగ్రెస్ ఎన్నికల కమిటీల్లో మనోళ్లు!

- సీనియర్ నేతలకు దక్కిన ప్రాతినిధ్యం
- మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా శ్రీధర్‌బాబు
- సభ్యులుగా పొన్నాల, బలరాం తదితరులు
- ఉమ్మడి జిల్లా నుంచి పలువురికి అవకాశం

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు – 2023 నేపథ్యంలో టీపీసీసీ అనుబంధ కమిటీలను ఆ పార్టీ హైకమాండ్ శనివారం సాయంత్రం ప్రకటించింది. ఎన్నికల మేనేజ్‌మెంట్, మెనిఫెస్టో ఏఐసీసీ కార్యక్రమాల అమలు, చార్జ్‌షీట్, ట్రెనింగ్, స్ట్రాటజీ తదితర కమిటీల్లో ఉమ్మడి వరంగల్‌కు చెందిన పలువురు సీనియర్లకు అవకాశం దక్కింది. దామోదర నర్సింహ చైర్మన్‌గా 9 మందితో వేసిన ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీలో నమిండ్ల శ్రీనివాస్‌కు అవకాశం దక్కింది. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చైర్మన్‌గా 24 మందితో వేసిన కాంగ్రెస్ రాష్ట ఎన్నికల మేనిఫెస్టో కమిటీలో ఆయనతో పాటు ఐదుగురికి అవకాశం కల్పించారు. సభ్యులుగా టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, కేంద్రమాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, కూచన రవళిరెడ్డి, ప్రొఫెసర్ కె.వెంకటస్వామిలు పేర్లు ఉన్నాయి. 10మంది సభ్యులతో ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీకి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్‌కు చైర్మన్ పదవి దక్కింది. అదేవిధంగా 14 మందితో వేసిన చార్జ్‌షీట్ కమిటీలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, బెల్లయ్యనాయక్‌లు ఉన్నారు. 17మంది సభ్యులతో వేసిన ట్రెనింగ్ కమిటీకి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ను చైర్మన్‌గా నియమించారు. కొక్కిరాల ప్రేంసాగర్ రావు చైర్మన్‌గా 13 మంది సభ్యులు గల స్ట్రాటజీ కమిటీలో సింగాపురం ఇందిరకు అవకాశం దక్కింది.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గిరిజనులు ఆదరించాలి



ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల : ప్రత్యేక గ్రామపంచాతీలుగా తండాలను అభివృద్ధిచేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గిరిజనులు ఆదరించాలని రాష్ట మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పెద్దమడూరుకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు, ప్రముఖ సామాజిక వేత్త బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ధరావత్ తండా, ధర్మగడ్డ తండా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమీక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, సుందర్ రామిరెడ్డి, మల్లేశం, కొత్త జలంధర్ రెడ్డి, సునిత, గేమానాయక్, దేవా నాయక్, జనార్ధన్, ఆంజనేయులు, చంద్రగిరి సంపత్, జోగు శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

జమిలి అయినా బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ: దేశ వ్యాప్తంగా జమిలి ఎన్నికలు వచ్చినా రాకున్నా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తెలంగాణను కేసీఆర్ సీఎంగా దేశం గర్వించేలా తీర్చి దిద్దారన్నారు. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయంటే ఆ క్రెడిట్ కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జనగామ జిల్లాగా ఏర్పడిన తర్వాత, ప్రజలు కోరుకున్న విధంగా అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. జిల్లా కోర్టుకు పక్కా భవన నిర్మాణం కోసం 10 ఎకరాల స్థలం కేటాయించగా, జిల్లా పోలీసుల కార్యాలయం ఏర్పాటుకు ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ నెల 15న సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి మెడికల్ కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా నలుమూలల నుంచి 20 వేలకు పైగా ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపుల్లో 50శాతం ఉంటే, తెలంగాణలో 40 సీట్లు అందుబాటులోకి రావడం కేసీఆర్ అకుంఠిత దీక్షకు నిదర్శనమన్నారు. కేసీఆర్ దేశానికి సారథ్యం వహించడం ఖాయమన్నారు. ఆయన మేథస్సు దేశానికి అవసరమని 140 కోట్ల మంది ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. జనగామలో వచ్చే ఎన్నికల్లో తనను మూడోసారి అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, ఏఎంసీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, కౌన్సిలర్లు కర్రె శ్రీనివాస్, మారబోయిన పాండు, నాయకులు లింగయ్య, ఏబేలు, రాజు,సందీప్, లెనిన్, సతీష్, ఆనంద్, శ్రీశైలం ఉన్నారు.


కేయూ సెలవులు పొడిగింపు

- సర్క్యులర్ జారీ చేసిన రిజిస్ట్రార్
- ఆన్‌లైన్‌లో తరగతుల నిర్వహణకు ఆదేశం
- నాన్ టీచింగ్, టీచింగ్‌కు సెలవులు లేవు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ కళాశాలలు, పీజీ, ప్రొఫెషనల్స్ కోర్సుల అన్ని విభాగాల విద్యార్థులకు ఈనెల 11 నుంచి 18వ తేదీ వరకు సెలవులను పొడిగిస్తూ శనివారం రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు సర్క్యులర్ జారీచేశారు. పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు గత నెల 25న ముగిశాక 26 నుంచి ఈనెల 3వ తేదీ వరకు సెలవులు ఇచ్చారు. ఈనెల 4న రీ ఓపెన్ చేయాల్సిండగా మళ్లీ రెండోసారి సెలవులను 10వ తేదీ వరకు పొడిగించారు. అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ఇటీవల వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు ప్రిన్సిపాల్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేసిన నేపథ్యంలో వర్సిటీ అధికారులు కేసులు పెట్టడంతో వారిని పోలీసులు అరెస్టుచేశాక కోర్టులో ప్రవేశపెట్టగా.. తమను టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొట్టారని ఆరోపించగా.. వారిని మళ్లీ వైద్య పరీక్షలకు పంపించిన విషయం తెలిసిందే. పది మందిపై కేసులు నమోదు చేయగా అందులో ఇద్దరికి రిమాండ్ విధించగా మరో 8 మందికి కోర్టు బెయిల్ ఇచ్చింది. యూనివర్సిటీ వీసీతోపాటు రిజిస్ట్రార్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్‌చేస్తూ గాయపడిన విద్యార్థులతో పాటు వివిధ విద్యార్థి సంఘాల జేఏసీ బాధ్యులు వర్సిటీలో దీక్షలు కొనసాగిస్తున్నారు. వివిధ విపక్ష పార్టీల బాధ్యులు కూడా వారికి సంఘీభావం తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత వాతావరణం ఏర్పడేలా తగిన చర్యలు తీసుకోకుండా మళ్లీ సెలవులు పొడిగించడంపై విమర్శలు వస్తున్నాయి. గత నెల 28 నుంచి అలుమనాక్ ప్రకారం పీజీ కోర్సుల మూడవ సెమిస్టర్ విద్యార్థులకు తరగతులు నిర్వహించాల్సి ఉండగా.. ఆదిశగా దృష్టి పెట్టలేదు. హాస్టళ్లు ఈనెల 19న రీ ఓపెన్ చేసే అవకాశం ఉంటుంది. విద్యార్థులు అప్పుడే మెస్ బకాయిలు చెల్లించి కార్డులను రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే వీసీ, రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకునేవరకు తమ పోరాటం ఆగదని విద్యార్థి సంఘాల జేఏసీ ప్రకటించటం.. అలాగే ఈనెల 12న వరంగల్ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ముందుగా ప్రకటించిన విధంగా వర్సిటీ పరిధిలోని వివిధ పరీక్షలు కొనసాగుతాయి. అయితే.. క్యాంపస్‌లోని అన్ని విభాగాల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించాలని రిజిస్ట్రార్ ఆయా విభాగాల అధిపతులను, అధ్యాపకులను ఆదేశించారు. ఇదిలా ఉండగా.. యూనివర్సిటీ బయటి కళాశాలల్లో ఆఫ్‌లైన్‌లో బోధన కొనసాగనుందని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

దర్గా ఉత్సవాలకు ప్రత్యేక చేనేత చాదర్లు



చాదర్‌ను తిలకిస్తున్న ఖుస్రూపాషా

కాజీపేట రూరల్: కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఉత్సవాలకు పుణెలో ప్రత్యేకంగా తయారు చేసిన చేనేత చాదర్లను భక్తులు తీసుకొచ్చినట్లు శనివారం దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా తెలిపారు. ఈఉత్సవాలకు తరలివచ్చే భక్తులు వారి ఇష్టం మేరకు చాదర్లు తీసుకొచ్చి దర్గాకు సమర్పించి ప్రార్థిస్తారని పేర్కొన్నారు.

అగ్నికణం చాకలి ఐలమ్మ

- భూస్వాములు, రజాకార్లను తరిమికొట్టిన ధీశాలి ఐలమ్మ
- దేశ్‌ముఖ్‌లకు ముచ్చెమటలు పట్టించిన సాహసి
- నేడు చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి



చాకలి ఐలమ్మ(ఫైల్)



పాలకుర్తిలోని ఐలమ్మ విగ్రహం



ఐలమ్మ స్మారక స్థూపం

పాలకుర్తి టౌన్: తెలంగాణ రైతాంగ విప్లవోద్యమంలో చిట్యాల ఐలమ్మ పాత్ర వీరోచితమైనది. ఆమె జీవితం నేటికీ అనేక పోరాటాలకు ప్రేరణ. భూమికోసం, భుక్తి కోసం, పేద బతుకుల విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిల్చిన అగ్నికణం చాకలి ఐలమ్మ. విస్నూరుదొర రాపాక రాంచంద్రారెడ్డి ఆగడాలపై పోరాడిన తొలివీరనారి ఐలమ్మ. తన పంటపొలాల్లో పండించిన ధాన్యం విషయంలో ప్రారంభించిన ఉద్యమం తెలంగాణ వ్యాప్తంగా వ్యాపించింది. రాంచంద్రారెడ్డికి వ్యతిరేకంగా ఎర్ర జెండాను చేతపట్టి ప్రజలను సమీకరించి సాగించిన పోరాటం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. ఐలమ్మ కుటుంబీకులు మల్లంపల్లి జమీందార్ ఉత్తంరాజు కొండల్‌రావు దగ్గర 40 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని సాగుచేస్తుండగా దేశ్‌ముఖ్ ఏజెంట్ పాలకుర్తి పోలీసుపటేల్ వీరమనేని శేషగిరి రావు.. పెత్తనం చెలాయిస్తూ వెట్టిచాకిరి చేయించుకునేవాడు. ఒక రోజున ఐలమ్మ, ఆమె భర్త నర్సయ్యను పశువులతో సహా వచ్చి తన వ్యవసాయ పొలంలో పనిచేయాలని పోలీస్ పటేల్ ఆదేశించారు. అప్పటికే ఆంధ్ర మహాసభలో చేరిన ఐలమ్మ కుటుంబంపై కక్షగట్టి దాడులు చేయించారు. ఆంధ్ర మహాసభ నాయకులు ఆరుట్ల రాంచంద్రారెడ్డి, బీంరెడ్డి నర్సింహారెడ్డి పాలకుర్తిలో జాతర సందర్భంగా నల్లా నర్సింహులు, నల్లు ప్రతాప్‌రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావును తీసుకొచ్చారు. పాలకుర్తి తదితర ప్రాంతాల్లో జరిగిన కొన్ని సంఘటనల్లో ఐలమ్మ, ఆమె భర్త నర్సయ్య, కుమారులు సోమయ్య, లచ్చయ్యపై రాంచంద్రారెడ్డి కుట్రకేసు పెట్టి జైలులో బంధించాడు. మల్లంపల్లి జమీందారు కొండల్‌రావును దేశ్‌ముఖ్ పిలిపించి ఐలమ్మకు కౌలుకు ఇచ్చిన భూమి తనకు కౌలుకు ఇచ్చినట్లుగా అగ్రిమెంట్ రాయించుకుని దాని ఆధారంగా ఐలమ్మ పంటను ధ్వంసం చేసేందుకు మనుషులను పంపించాడు. ఐలమ్మ పంటను కాపాడుకునేందుకు బీంరెడ్డి నర్సింహారెడ్డి నాయకత్వంలో ఆంధ్రమహాసభ కార్యకర్తలు.. గుండాలను తరిమికొట్టారు. ఐలమ్మ పోరాటం గురించి తెలుసుకున్న పుచ్చలపల్లి సుందరయ్య ఆమె ఇంటికొచ్చి ఇల్లునే కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంగా మార్చి ఇంటి అవరణలో సుందరయ్య అరుణ పతాకాన్ని ఎగురవేశాడు.భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటుకు ఐలమ్మ చిహ్నంగా నిలిచిందని సుందరయ్య కొనియాడారు. 1895 సెప్టెంబర్ 26న రాయపర్తి మండలంలోని కిష్టాపురంలో ఐలమ్మ జన్మించగా, పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో 1908లో తన 13వ యేట వివాహం జరిగింది. 90 ఏండ్ల వయసులో 1985 సెప్టెంబర్ 10న ఐలమ్మ కన్నుమూసింది. ఆమె పోరాటానికి చిహ్నంగా మండల కేంద్రంలో ఐలమ్మ స్మాకర స్థూపం, భవనం, కాంస్య విగ్రహాన్ని నిర్మించారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో ఏర్పాటు చేసే మహిళ యూనివర్సిటీకి.. ఏదైనా జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టాలని, హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, పాలకుర్తిలో ఐదెకరాల్లో పార్కు ఐలమ్మ పేరుతో స్మృతివనం నిర్మించాలని ఆమె అభిమానులు, ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- మోకాళ్లపై నిలబడి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జనగామ రూరల్: సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యూలర్ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆరో రోజు కొనసాగిన దీక్ష శిబిరం వద్ద వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అంతకుముందు కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మోకాళ్లపై నిలబడి కళ్లకు నల్లరిబ్బన్ కట్టుకొని నిరసన తెలిపారు. 11వ తేదీ నుంచి సమ్మెను ఉధృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, దయాకర్, రమేష్, హరిలాల్, రవి, రాజయ్య, రాఘవులు, స్వప్న, పెంటమ్మ, సంధ్య, లలిత, మానస, వాణిశ్రీ పాల్గొన్నారు.

3,885 కేసుల పరిష్కారం

- లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ



మాట్లాడుతున్న జడ్జి రవీంద్ర శర్మ

జనగామ రూరల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ ఆదాలత్‌లో 3,885కేసులు పరిష్కారమైనట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్ర శర్మ తెలిపారు. ఈసందర్భంగా రవీంద్ర శర్మ మాట్లాడుతూ.. కక్షిదారులు రాజీపడి కేసులు లేకుండా చూసుకోవాలని రాజీపడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. మొత్తం 5 బెంచ్‌ల్లో కేసులు పరిష్కారించినట్లు తెలిపారు. మొదటి బెంచ్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ, రెండో బెంచ్‌లో సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్, మూడో బెంచ్‌లో జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, నాల్గవ బెంచ్‌లో అదనపు జూనియర్ జడ్జి సీహెచ్ నర్మద, ఐదో బెంచ్‌లో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకటరాంనర్సయ్య మొత్తం 3,885కేసులు పరిష్కరించారు. ఇందులో సివిల్ కేసులు 167, క్రిమినల్ కేసులు 3,136, ఫ్రీ లిటిగేషన్ కేసులు 582 పరిష్కారం కాగా.. రూ.17,89,770 వచ్చినట్లు వెల్లించారు. మధ్యాహ్నం సమయంలో సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కక్షిదారులకు అన్నదానం చేశారు.

పోలీసులు అక్రమంగా కేసు పెట్టారు

- భూవివాదంపై మాట్లాడినందుకే..
- వెంకిర్యాల ఉపసర్పంచ్ సిద్ధారెడ్డి

జనగామ రూరల్: ఓ భూవివాదం పరిష్కారానికి వెళ్లిన తనపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెంకిర్యాల ఉపసర్పంచ్ సిద్ధారెడ్డి శనివారం తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకిర్యాల గ్రామానికి చెందిన నల్లా రాంరెడ్డి మరో వ్యక్తి మధ్య 25గుంటల విషయంలో గత కొంత కాలంగా భూవివాదం కొనసాగుతోంది. ఈవిషయంలో ఎస్సై సృజన్ కుమార్ పలుమార్లు బాధితులను పిలిచి ఇబ్బందులు పెడుతున్నారని పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా తనపై దుర్భాషలాడారని సిద్ధారెడ్డి ఆరోపించారు. సివిల్‌కేసులో పోలీసుల జోక్యం సరికాదని చెప్పినందున తనపై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపే ప్రయత్నం చేశారని తెలిపారు. దీనిపై సీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధి విషయంలోనే ఇలా ప్రవర్తిస్తే.. ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు. ఆయన వెంట బాధితులు నల్లా రాంరెడ్డి, రాజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

3 కిలోల బంగారం, పిస్తోలు స్వాధీనం?

- దొంగల ముఠాను విచారిస్తున్న పోలీసులు!

వరంగల్ క్రైం: మూడు పోలీస్‌స్టేషన్లు.. ఆరు అపార్ట్‌మెంట్లలో చోరీలకు పాల్పడిన దొంగల ముఠాను 24 గంటలలోపు పట్టుకున్న పోలీసులు వారిని విచారిస్తున్నట్లు సమాచారం. కర్నూలు సరిహద్దులో దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి సుమారు 3 కిలోల బంగారంతో పాటు ఒక పిస్తోల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్ గజీయా ప్రాంతానికి చెందిన నలుగురు దొంగల ముఠా గతంలో హైదరాబాద్, బాసర, కర్నూల్, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో చోరీలకు పాల్పడింది. ముందస్తుగా ఎంపిక చేసుకున్న అపార్ట్‌మెంట్లలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు చోరీలకు పాల్పడటం ఈ ముఠా ప్రత్యేకత. అపార్ట్‌మెంట్లు అధికంగా ఉన్న ప్రాంతాలను ముందుస్తుగా గుర్తించి వాటి పరిసరాలను గమనించి అత్యాధునిక టెక్నాలజీ అయిన నావిగేషన్ ద్వారా చోరీలకు పాల్పడుతారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మాదిరి డ్రెస్సింగ్ వేసుకుని ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. విచారణలో పోలీసులే విస్తుపోయే నిజాలు వెలుగుచూస్తున్నట్లు సమాచారం.

కొనసాగుతున్న కాంట్రాక్టు లెక్చరర్ల దీక్షలు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూ పరిపాలన భవనం వద్ద చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల రిలే నిరాహార దీక్షలు శనివారం కొనసాగాయి. ఈ దీక్షలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ సీహెచ్.రాజు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించి వారికి న్యాయం చేయాలని కోరారు. అలాగే, తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ శ్రీధర్‌కుమార్‌లోథ్ మాట్లాడారు. దీక్షలో శ్రీదేవి, కవిత, చంద్రశేఖర్ కూర్చున్నారు. సంఘీభావం తెలిపిన వారిలో ప్రసాద్, వెంకటేష్, నాగయ్య ఉన్నారు.



కొలువు కొట్టేయ్..

- అప్రెంటిస్‌షిప్‌తో విస్తృత ఉద్యోగావకాశాలు
- ఐటీఐ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు అదనపు అర్హత
- రేపు కాజీపేటలో అప్రెంటిస్‌షిప్ మేళా

కాజీపేట: సాంకేతిక విద్య.. త్వరితగతిన ఉద్యోగం సాధించడంలో అన్నింటికన్నా ముందు వరుసలో ఉండే కోర్సు. అందుకే నేటి రోజుల్లో వేలాది మంది విద్యార్థులు ఈ విద్యనభ్యసిస్తున్నారు. చదువు పూర్తయ్యాక ఉద్యోగాల అన్వేషణలో ఉపకరించేదే అప్రెంటిస్‌షిప్. దీనిని కూడా పూర్తి చేస్తే ఉద్యోగాలు తలుపుతడతాయి. ఇంజనీరింగ్, డిప్లొమో కన్నా అతి మెరుగ్గా ఐటీఐ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు నేటి రోజుల్లో ఉద్యోగావకాశాలు తక్కువ లభిస్తున్నాయి. అందుకే ఏటా ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు వివిధ కంపెనీల్లో అప్రెంటిస్‌షిప్‌నకు వెళ్తున్నారు.

అప్రెంటిస్‌షిప్..అదనపు అర్హత..

ఐటీఐ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ చేస్తే ఏదైనా కంపెనీలో ఉద్యోగం తేలిగ్గా లభిస్తుంది. ప్రస్తుతం ఉన్న 32 ట్రేడ్‌ల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారు వెంటనే అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. www.apprenticerhip.gov.in వెబ్‌సైట్‌లో అభ్యర్థి పేరును నమోదు చేసుకోవాలి. వెంటనే వారి సెల్‌ఫోన్‌కు పేరు నమోదైనట్లు మేసేజ్ వస్తుంది. అభ్యర్థి మెయిల్ ఐడీ కూడా అందులో ఇవ్వాల్సి ఉంటుంది. పదో తరగతి ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఐటీఐ ట్రేడ్ ధ్రువీకరణ పత్రం జిరాక్స్ పత్రాలను అందులో చూపించాలి. ఆ మెయిల్‌కు అప్రెంటిస్‌షిప్ ఇచ్చే కంపెనీల పేర్లు వస్తాయి. అభ్యర్థి ట్రేడ్‌ను బట్టి అతడు ఏ కంపెనీకి అర్హుడో తేలికగా తెలిసిపోతుంది. కంపెనీలు కూడా అప్రెంటిస్‌షిప్ ఇచ్చేందుకు అదే వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకుంటాయి. కంపెనీ పేరు, జీఎస్టీ నంబర్, ఈపీఎఫ్ నంబర్, ఫ్యాక్టరీ రిజిస్ట్రేషన్ వంటివి వెబ్‌సైట్‌లో పేర్కొనగానే కంపెనీ అప్రెంటిస్‌షిప్ ఇచ్చేందుకు అర్హత పొందుతుంది. ఉదాహరణకు ఒక కంపెనీలో వంద మంది వర్కర్లు పనిచేస్తుంటే అదే కంపెనీలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు పదిమంది అభ్యర్థులను పిలిచేందుకు అవకాశం ఉంది. మరో కంపెనీలో ఐదు వందల మంది వరకు వర్కర్లు ఉంటే యాభై మంది వరకు అప్రెంటిస్‌షిప్ ఇచ్చేందుకు అభ్యర్థులను పిలుస్తుంది.



కాజీపేట ఐటీఐ

> **11న కాజీపేటలో అప్రెంటిస్‌షిప్ మేళా..**
> కాజీపేట ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేళాకు రాష్ట్రంలోని వివిధ కంపెనీలు హాజరుకానున్న నేపథ్యంలో ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు హాజరు కావాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.

రెండేళ్ల ట్రేడ్‌కు ఏడాది..

ఐటీఐ రెండేళ్ల ట్రేడ్ పూర్తి చేసిన వారికి ఏడాది పాటు అప్రెంటిస్‌షిప్ ఉంటుంది. అదే ఏడాది ట్రేడ్ అభ్యర్థులతే రెండేళ్లు అప్రెంటిస్‌షిప్ చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో 3వేల మందికిపైగా పేర్ల నమోదు..

ఐటీఐ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థుల్లో జిల్లాలో ఇప్పటి వరకు 3వేల మందికిపైగా అప్రెంటిస్‌షిప్ కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో అర్హులకు వివిధ కంపెనీలు తమ అవసరాల మేరకు కాల్‌లెటర్లు పంపుతున్నాయి.

నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీం..

2016 నేప్స్ (నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీం) కింద కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. దీనిలో కొంత మొత్తాన్ని అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులకు రీయింబర్స్‌మెంట్ కింద కంపెనీలకు అందజేస్తారు. అభ్యర్థికి నెలకు రూ. 8,500 స్టైఫండ్ రూపేణా లభిస్తుంది.

ఆర్టీసీలో ఏడాదికి 300మందికిపైగా శిక్షణ..

వరంగల్, కరీంనగర్ రీజియన్లలో ఉన్న ఆర్టీసీ డిపోల్లో ఏడాదికి 300 మందికిపైగా ఐటీఐ ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు అప్రెంటిస్‌షిప్ చేస్తున్నారు.

భారీగా నిధుల కేటాయింపు..

దేశంలో అప్రెంటిస్‌షిప్ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది అన్ని రాష్ట్రాలకు రూ. 4వేల కోట్లు కేటాయించింది. ఇందులో 50 లక్షల మంది అభ్యర్థులు శిక్షణ పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోనుంది. 2023 ఏడాది చివరి వరకు శిక్షణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

ఏయే కంపెనీలు ఇస్తాయంటే..

ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వే, బెల్, బీడీఎల్, బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్, బీడీఎల్, ఆర్టీసీ, జెన్‌కో, సింగరేణి, పేరున్న కంపెనీలతో పాటు అనేక సంస్థలు ఉన్నాయి. జిల్లాలతో సంబంధం లేకుండా జాతీయ స్థాయిలో శిక్షణ ఇస్తున్నాయి. వీటితో పాటు ప్రైవేట్ కంపెనీలు కూడా అప్రెంటిస్‌షిప్ ఇస్తున్నాయి. ఆయా సంస్థల్లో ఇప్పటికే వందలాది మంది అప్రెంటీస్ పూర్తి చేసుకున్నారు. పలువురికి ఉద్యోగాలు కూడా లభించాయి.

ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి



“ గతంతో పోల్చితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలతో సాంకేతిక విద్యనభ్యసిస్తున్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. అప్రెంటిస్‌షిప్‌నకు అవకాశాలు దొరుకుతున్నాయి. ఉపాధికి ఐటీఐలు ఎంతో దోహదపడుతున్నాయని చెప్పొచ్చు.

కె.అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్, కాజీపేట ఐటీఐ

అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ సదస్సుకు జిల్లా వాసుల ఎంపిక



టి.జయపాల్ రెడ్డి



ప్రవీణ్ దేవానందన్



రాజశ్రీ దుర్కే



రణదీర్ చౌదరి



మనుశ్రీ నరెడ్ల

హన్మకొండ: ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరిగే ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ వరల్డ్ కాంగ్రెస్‌కు హనుమకొండ జిల్లాకు చెందిన ఫార్మసీ నిపుణులు ఎంపికయ్యారు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు బ్రిస్బేన్‌లో ఈ ప్రపంచ స్థాయి సదస్సు జరుగనుంది. ప్రపంచ వ్యాప్తంగా 195 దేశాల నుంచి విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు, వ్యాపార దిగ్గజాలు, ఫార్మసీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ కాంగ్రెస్‌కు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల చైర్మన్ టి.జయపాల్ రెడ్డితో పాటు నలుగురు అధ్యాపకులు ఈ సదస్సుకు ఎంపికయ్యారు. వీరు పంపిన పరిశోధన పత్రాలను వరల్డ్ కాంగ్రెస్ ప్రతినిధులు పరిశీలించి ఆమోదించి ఫార్మసీ సదస్సుకు ఎంపిక చేశారు. సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం హెడ్ డాక్టర్ ప్రవీణ్ దేవానందన్, అధ్యాపకులు రాజశ్రీ దుర్కే, రణదీర్ చౌదరి, నరెడ్ల మనుశ్రీ ఎంపికయ్యారు.

లోన్ పేరిట మోసం..

- ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు

కాటారం: లోన్ పేరిట ఓ ప్రభుత్వ ఉద్యోగితో పాటు ఆమె భర్త, కూతురు, మరో ఇద్దరు మోసం చేశారని, వీరిపై ఎస్పీ కరుణాకర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు శనివారం తెలిపారు. బాధితురాలి కథనం ప్రకారం మహాముత్తారం మండలం మాదారానికి చెందిన పెరుమాండ్ల పోశమ్మ కాటారం మండల మేడిపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో వంట మనిషిగా పని చేస్తోంది. పాఠశాలలోని ఓ ఉపాధ్యాయురాలు, ఆమె భర్త పదే పదే బ్యాంక్‌లోన్ కావాలా అని అడేగేవారు. దీంతో రూ.2లక్షల లోన్ ఇప్పించమని కోరింది. ఈ క్రమంలో సదరు ఉద్యోగి భర్త మంథనికి తీసుకెళ్లి ధ్రువపత్రాలపై సంతకాలు తీసుకున్నారు. వారం తర్వాత గోదావరిఖని ఐసీఐసీఐ బ్యాంక్ ద్వారా రూ.6 లక్షల రుణం మంజూరైనట్లు తెలిపారు. బ్యాంక్ ద్వారా రూ.3 లక్షలు విత్‌డ్రా చేసుకోగా , మరో 3 లక్షలు అకౌంట్‌లో లేవు. దీనిపై సదరు ఉద్యోగి భర్తను నిలదీయగా తనకు సంబంధం లేదని చెప్పారు. ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సమస్య తలెత్తుతుందని బెదిరించడంతో మిన్నుండిపోయింది. ఈ క్రమంలో 15 రోజుల క్రితం లోన్ ఈఎంఐ చెల్లించడం లేదని ఐసీఐసీఐ బ్యాంక్ అధికారులు ఇంటికి రాగా విషయం బయటపడింది. ఐసీఐసీఐ బ్యాంక్‌లో రూ.6లక్షలతో పాటు బాధితురాలికి తెలియకుండా తన పేరిట సదరు ఉద్యోగి, ఆమె భర్త, తన కూతురు, మరో ఇద్దరు కాటారం ఎస్బీఐలో రూ.14 లక్షల లోన్ తీసుకున్నారు. బాధితురాలి చెక్కులను చోరీ చేసి లోన్ డబ్బును బ్యాంక్ నుంచి డ్రా చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని బాధితురాలు పోశమ్మ కోరారు. ఈ విషయమై కాటారం ఎస్బీఐ మేనేజర్ వెంకట్‌ను 'సాక్షి' వివరణ కోరగా పోశమ్మకు తమ బ్యాంక్‌లో ఎలాంటి లోన్ లేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



సుమన్ మృతదేహం

డోర్నకల్ : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన డోర్నకల్ పట్టణంలో జరిగింది. ఎస్సై సంతోష్‌రావు కథనం ప్రకారం గార్ల మండలం లింగ్యాతండాకు చెందిన సోదరులు బోడ సుమన్ (34), సురేష్ ఖమ్మంలోని ఓ దుకాణంలో పని చేస్తున్నారు. శనివారం ఉదయం ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తున్నారు. ఈ క్రమంలో డోర్నకల్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో వాహనం నడుపుతున్న సుమన్ అపస్మారకస్థితికి చేరుకోగా అతడి సోదరుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. మరో వాహనంపై వచ్చిన అమ్మపాలేనికి చెందిన సుంకర సతీష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సైలు సతోష్‌రావు, ఝాన్సీ, ఏఎస్సై కోటేశ్వర్‌రావు ఘటనా స్థలికి చేరుకుని ముగ్గురిని పీహెచ్‌సీకి తరలించారు. సుమన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సురేష్, సతీష్‌ను మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. మృతుడి ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సంతోష్‌రావు తెలిపారు.

రైళ్ల రద్దుతోనే ప్రమాదాలు..

డోర్నకల్ రైల్వే స్టేషన్ పరిధిలో వందలాది మంది ఖమ్మం, మహబూబాబాద్ లాంటి పట్టణాల్లో చిరు ఉద్యోగాలు చేస్తున్నారు. నెలల తరబడి ప్యాసింజర్ రైళ్లు రద్దు కావడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుమన్ గతంలో రోజూ పుష్పుల్‌కు వెళ్తుండగా ఆ రైలు రద్దు కావడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..



రాజు మృతదేహం

తరిగొప్పుల : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని అబ్దుల్ నాగారంలో జరిగింది. గ్రామానికి చెందిన భాషబోయిన రాజు(45) రోజు మాదిరిగానే వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. ఇనుప గుంటుకను పత్తి చేను వద్దకు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో గుంటుక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగులడంతో విద్యుత్ సరఫరై రాజు అక్కడే మృతి చెందాడు. ఈ ఘటనను చూసిన రాజు కుమారుడు సూర్యతేజ కేకలు వేయడంతో స్థానికులు ఘటనా స్థలికి చేరుకుని చూడగా అప్పటికే రాజు మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

BIRTH DAY GREETINGS



EDUCATION

■ Complete any Degree; P.G; Diploma; B.Tech; BAMS; BHMS; D.ఫార్మసీ; B.ఫార్మసీ; ANM; GNM; నర్సింగ్ in 6 months. ✆ 95504 43817 [B-190758]

REAL ESTATE

OPEN PLOTS FOR SALE

■ యాదాద్రి, ఆలేరు, హన్మకొండ, వరంగల్ ఓపెన్ ప్లాట్స్ 100 గజాల నుండి 500 గజాల వరకు అమ్మబడును, కొనబడును. సెల్: 9849944629. [W-1229408]

LAND FOR SALE

■ 3 ఎకరాల 20 గుంటల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. డాంబర్‌రోడ్ టచ్చు, అండర్ గ్రౌండ్ వాటర్ సిస్టం. మొగుళ్ళపల్లి - 9848714112, No Brokers. [W-1229419]

PLOT FOR SALE

■ హన్మకొండ చౌరస్తా నుండి 2KM దూరంలో 300 గజాల ప్లాటు తూర్పు ఫేస్ కలదు. ఒక రూమ్ కట్టి ప్లాటు చుట్టూ 5F' గోడ, గేట్ పెట్టినది అమ్మకం. గు॥ రూ॥ 23000/- ఫిక్స్‌డ్ నో బ్రోకర్స్. 9395561655. [W-785648]

HOUSE FOR SALE

■ వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-1229415]

■ HNK Karimnagar Highway near Hasanparthy Independent Luxury House W/F 176 yards (28'9"*55') KUDA Layout. Cont: 9963933629 / 9550480230. [M-10265]

SERVICES

■ శ్రీరామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించలేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9133214214. [H-788626]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావ్, సెల్: 9849145043. [W-1229405]

CHANGE OF NAME

■ I, the undersigned Marapaka Anuradha (New Name), W/o. Marapaka Kattaswamy, previously called Marapaka Radha (Old Name), R/o. H.No. 25-11-281/5, Balaji Nagar, Kazipet, Hanamkonda, Warangal Dist- 506003, Telangana state, India, solemnly declare. [W-1229417]

HOME CARE SERVICE

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ (AP No.1) 24 గం॥ వృద్ధులను, పేషెంట్ల సేవకు, బేబీకేర్, ఇంటిపని, వంటపనికి పని మనుషులను మీ ఇంటికి పంపగలము ✆ 95420 855 88, 95423 05588 [B-1206740]

WANTED

■ Daddysroad Company లో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం: 15000 నుండి 20000. సెల్: 9959120760, 9848785232. [W-1229412]

■ Male Only Marketing Executives - For Ready Mix Concrete Any degree, Accountants - Any Degree with Tally, Site Supervisors - Diploma / B.Tech Civil with for all 2-4 Yrs Exp. Drop your Resume on WhatsApp & Contact No: 7330891166, 8555890439, 9849277408 [WA-13357]

■ బీకామ్ పాస్సై, అకౌంట్స్ తెలిసి, టైపింగ్ హయ్యర్ లేదా లోయర్ కల్గి, అనుభవము కల స్త్రీ/పురుషులకు జీతం 15 నుండి 20వేల వరకు ఇవ్వబడును. గోపీచంద్ CA, 1-7-1382 ADV CLY, హన్మకొండ. సెల్: 9849821999 వాట్సాప్ కలదు. [WA-16712]

■ రూపాయి పెట్టుబడి లేకుండా లక్షల్లో సంపాదించే అవకాశం. ప్రముఖ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ సంస్థ, హన్మకొండలో విస్తరించుటకు మంచి టీం లీడర్స్ కోసం ఎదురు చూస్తుంది. అనుభవం /ఆసక్తి ఉన్న స్త్రీ/పు॥ సంప్రదించండి. మంచి కమీషన్ ఇవ్వబడును. సెల్: 9700686760. [W-189171]

■ Wanted Female Student Counsellor & TeleCaller with Good Communication Skills in Reputed Organization at Hanamkonda. Cont: 9550475546. [W-189170]

■ హస్సిరెడ్డి గ్రాఫిక్స్‌లో పని చేయుటకు ఆన్లైన్ అప్లికేషన్‌లో అనుభవం కల్గిన ఎంప్లాయ్స్ కావలెను. NGO's కాలనీ రోడ్, వికాస్‌నగర్, Opp: భవానినగర్ ఆర్చి, HNK. Cell: 9000009359 [W-189164]

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000/- - 16000/- సంప్ర: 9000463426. [W-1229413]

■ వరంగల్‌లో వాషింగ్ మిషన్ రిపేర్ చేయడానికి Boys కావలెను. కొత్తవారు /అనుభవం అవసరం లేదు. (బైక్ తప్పనిసరి + పెట్రోల్ అలవెన్స్ + మంచి జీతం ఇవ్వబడును) సంప్ర॥ 8179585395. [W-1229354]

■ వరంగల్ స్టేషన్‌రోడ్‌కు గల విష్ణు లాడ్జిలో పని చేయుటకు రూమ్ బాయ్స్ కావలెను. జీ॥ 8000/- మరియు మేనేజర్ ఒక్కరు- జీ॥ 10000/- ఇవ్వబడును. సంప్ర॥ 9391864657 [W-1229414]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (TS.No.-1) హైదరాబాద్‌లో శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవ చేయుటకు M/F కావలెను. భోజనం + వసతి + జీతం 15-16వేలు. ఫోన్: 9618221160, 9133271122 [H-788535]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 8186055849. [G-751670]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీతం 18K. ఫోన్ : 9963114535, 7287061111 [HA-189330]

■ హన్మకొండ, ఖాజీపేటలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 hrs, జీతం: 12000/-, Hyd లో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 hrs, 12000/-. Ph: 9642279111. [H-189525]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP No.1) విజయవాడ శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవచేయుటకు M/F కావలెను. భోజనం + వసతి కలదు. జీ: 15-16వేలు. ✆ 8247500792, 8247500683. [B-1206730]

WANTED TEACHERS

■ Wanted Teachers to teach Maths, Hindi & Supporting Teachers for 1st to 5th Classes E/M. Cont: 9963006221. [W-1229416]

> 4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



రాజేందర్ (ఫైల్)

హసన్‌పర్తి : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం పెగడపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన తుల్లా రాజేందర్ (52) కుటుంబపోషణ నిమిత్తం వివిధ వర్గాల నుంచి అప్పు చేశాడు. ఎలా తీర్చాలో తెలియక శనివారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కాగా, ఎంజీఎం మార్చురీలో రాజేందర్ మృతదేహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే రమేష్ సందర్శించారు. ఎమ్మెల్యే వెంట డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన తదితరులు ఉన్నారు.

ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలో మనస్తాపంతో మరొకరు..

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేస్టేషన్ సమీపంలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం వెళ్తుర్లపల్లికి చెందిన మొల్లు స్వామి (54) శనివారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలీ చేసుకుని జీవనం సాగించే స్వామి.. మద్యానికి బానిసై అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన.. ఉప్పల్ రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి భార్య వనమాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

రిజర్వాయర్‌లో కొట్టుకొచ్చిన మృతదేహం

- ఇల్లందకు చెందిన కొమురెల్లిగా గుర్తింపు



కొమురెల్లి(ఫైల్)

రాయపర్తి: మండలంలోని మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ఓ మృతదేహం కొట్టుకొచ్చింది. దీనిని చూసిన స్థానికులు పోలీసులు, కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన కొమ్ము కొమురెల్లి(50) మూడు రోజులక్రితం ఇల్లంద శివారులోని ఎస్సారెస్పీలో చేపలుపట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. దీనిపై కుటుంబీకులు వర్ధన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శనివారం ఎస్సారెస్పీ నుంచి రిజర్వాయర్ వైపునకు మృతదేహం కొట్టుకురావడంతో స్థానికులు చూసి పోలీసులు, కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకుని కొమురెల్లి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి గల్లంతు..

- వాగులో కొట్టుకుపోతున్న కుమారుడిని కాపాడుతుండగా ఘటన
- రాత్రి వరకు గాలింపు.. లభించని ఆచూకీ..
- వెనుదిరిగిన అధికారులు.. పంగిడిపల్లిలో విషాదం



భవాని (ఫైల్)



వాగు వద్ద భవాని కుటుంబీకులు

టేకుమట్ల: చేపల వేటకు వెళ్లిన తండ్రికొడుకుల్లో తనయుడు గల్లంతవుతుండగా .. కాపాడబోయి తండ్రి కూడా గల్లంతయ్యాడు. ఈ ఘటన శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామ శివారు చలివాగులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పురానం భవాని(39) తన చిన్న కుమారుడు సంతోష్‌తో కలిసి చలివాగులో చేపల వేటకు వెళ్లారు. ఒడ్డున నిలుచున్న సంతోష్.. కాలు జారి వాగులో పడి వరదలో కొట్టుకుపోతున్నాడు. ఈ క్రమంలో కుమారుడిని కాపాడేందుకు భవాని నీటిలో ఈదుకుంటూ వెళ్లాడు. ఆయనకు సాధ్యం కాకపోవడంతో అక్కడే ఉన్న మత్స్యకారులు రమేష్, రాములు.. చేపల తెప్ప సాయంతో సంతోష్‌ను రక్షించారు. అయితే వరద ఉధృతికి భవాని గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న ఎస్సై సుధాకర్, ఫైర్ అధికారులు అక్కడకు చేరుకుని భద్రతా చర్యలు చేపట్టారు.

గాలింపు చర్యల్లో మృత్యువు నుంచి తప్పించుకున్న మరో ఇద్దరు ..

చలివాగులో గల్లంతైన భవాని కోసం గాలింపు చర్యలు చేపట్టిన పంగిడిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నీటిలో మునిగి కొంత దూరం వరద ఉధృతికి కొట్టుకుపోతున్నారు. అక్కడే ఉన్న స్థానికులు తాడు అందించడంతో వారు ఒడ్డుకు చేరారు. దీంతో తాడే తమను మృత్యువు నుంచి తప్పించిందని వారు ఊపిరి పీల్చుకున్నారు. చీకటి పడే వరకు భవాని ఆచూకీ లభించకపోవడంతో అధికారులు వెనుదిరిగారు.

కాళోజీ స్ఫూర్తితోనే ప్రకృతిపై పరిశోధన



మాట్లాడుతున్న వాగ్గేయకారుడు జయరాజ్. చిత్రంలో విప్ దాస్యం, ఎమ్మెల్సీ దేశపతి, తదితరులు





'నా కలలు-నా ప్రపంచం'నాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం

- వాగ్గేయకారుడు జయరాజ్



మాట్లాడుతున్న దేశపతి

హన్మకొండ: ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణ రావు స్ఫూర్తితోనే తాను ప్రకృతిపై పరిశోధనలు చేస్తున్నానని వాగ్గేయకారుడు, సహజ కవి జయరాజ్ అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కాళోజీ పురస్కారం అందుకున్న జయరాజ్‌ను చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ, కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంశయ్య నవీన్ సన్మానించారు. అనంతరం జయరాజ్ మాట్లాడుతూ తనకు కాళోజీని కలిసే అవకాశం లభించిందని, ఆయన చేతి కర్ర, సంచిని మోసే భాగ్యం కలిగిందన్నారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాళోజీ జీవితం ఎంతో స్ఫూర్తిదాయమన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ కవులు, గాయకులు ఏం చేయగలరనే విషయం తెలంగాణ ఉద్యమం చూపెట్టిందన్నారు. కాళోజీ నారాయణ రావు స్వాభావికంగా ఉండేవారని, సహజత్వాన్ని కోరుకునే వారన్నారు. కాళోజీది వ్యక్తి జీవితం కాదని, సమాజ జీవితమన్నారు. సీఎం కేసీఆర్‌కు భాషపై పట్టుందన్నారు. ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజాకవి కాళోజీ నారాయణరావుకు మంచి గుర్తింపు ఇచ్చారన్నారు. వైద్య విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రైనీ ఐపీఎస్ శ్రద్ధాశుక్లా, కాళోజీ ఫౌండేషన్ సభ్యులు వీఆర్. విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

'నా కలలు-నా ప్రపంచం'నాటక ప్రదర్శన..

ఈ సందర్భంగా కాళోజీ జీవితం ఆధారంగా రూపొందించి ప్రదర్శించిన నా కలలు, నా జీవితం నాటకం ఆలోచింపజేసింది. డాక్టర్ జి.కుమారస్వామి దర్శకత్వంలో ఈ నాటకాన్ని ప్రదర్శించారు. అంతకు ముందు జిల్లా అధికారిక యంత్రాగం, కాళోజీ ఫౌండేషన్ సంయుక్తంగా కవి సమ్మేళనం నిర్వహించారు. 25మంది కవులు పాల్గొన్నారు. తెలుగు భాష తియ్యదనం, అన్ని మాండలికాల్ని సమతూచికంగా చూడాలన్న కాళోజీ గొప్పతనం, అరాచక పాలనకు వ్యతిరేకంగా గళం ఎత్తిన ధిక్కార స్వరం కాళోజీ అంటూ కవులు తమ రచనలలో ప్రస్తావించారు.

క్లుప్తంగా...

ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు ఆహ్వానం


చాంబర్ ప్లాటినం జూబ్లీ వేడుకల లోగోను ఆవిష్కరిస్తున్న సీపీ రంగనాథ్

వరంగల్: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు రావాలని వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం ఆయనను చాంబర్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం చాంబర్ ఆఫ్ కామర్స్ 75 వసంతాల ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్ లోగోను పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్‌ను పురస్కరించుకొని ఈనెల 15న శోభాయాత్ర, 20 నుంచి 26 వరకు వివిధ క్రీడల, సంగీత, నృత్య, సాంస్కృతిక పోటీలు, 30న వజ్రోత్సవాల ప్రారంభోత్సవం, అక్టోబర్ 1న ముగింపు ఉత్సవాలు ఉంటాయని పేర్కొన్నారు. చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, కమిటీ సభ్యులు సాగర్ల శ్రీనివాస్, అల్లే సంపత్, ఆర్.సత్యనారాయణ, రాజేష్ డి.కరాణి, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దిలో శిలాయుగం నాటి స్మారక శిల్పం

- గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి


శిల్పాన్ని చూపుతున్న రెడ్డి రత్నాకర్‌రెడ్డి

రఘునాథపల్లి: దేశంలోనే అరుదుగా కనిపించే బృహత్ శిలాయుగం నాటి స్మారక శిల్పాన్ని జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలో చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి శనివారం వెలుగులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. వెల్ది శివాలయంలోని ఈ స్మారక శిల్ప మూడు వేల ఏళ్ల నాటి బృహత్ శిలాయుగం నాటిదని, దీనిని హనుమంతుడిగా పూజిస్తున్నారని పేర్కొన్నారు. ఈ శిల్పాలతో కూడిన నిర్మాణాలు కర్ణాటక రాష్ట్రం గంగావతి తాలూకా కొప్పల్ జిల్లా హిరేబెనకల్ గ్రామంలోని గుట్టపై కనిపిస్తుంటాయని చెప్పారు. ఈ నిర్మాణాలు ఉన్న గుట్టలపైన దేవుడు నడుస్తాడని విశ్వసిస్తారని తెలిపారు. శివాలయుగం పక్కన బృహత్ శిలాయుగం నాటి శ్మశానవాటిక ఉన్నట్లు తెలుస్తున్నదని, రాతి పలకంలో స్వస్తిక్ ఆకారంలో ఒక పెట్టె మాదిరిగా నిర్మించే సమాధులను గూడు సమాధులు అంటారని పేర్కొన్నారు. ఇందులో తూర్పు వైపు ఉన్న రాతి పలకకు రంధ్రం ఉందని, ఇలాంటి పలక ఉన్న సమాధులను గవాక్షి ఉన్న గూడు సమాధి అంటారని వివరించారు. బచ్చన్నపేట, కొడకండ్ల, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి మండలాల్లో గవాక్షి ఉన్న గూడు సమాధులను గుర్తించామన్నారు. కొడకండ్ల మండల కేంద్రంలోని బయ్యన్న గుడిలో బృహత్ శిలాయుగం నాటి స్మారక శిల్పాన్ని భైరవుడిగా పూజలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి శివాలయం కాకతీయుల నాటి నేలమట్టమైన 16 స్తంభాల రాతి దేవాలయమని తెలిపారు. ఈ గ్రామంలో నవీన శిలాయుగం మొదలు నేటి వరకు చరిత్ర ఆనవాళ్లు ఉన్నాయని, పురావస్తు శాఖ అధికారులు పరిశోధించి చరిత్ర ఆధారాలు వెలికి తీయాలని కోరారు.

శ్రమజీవుల అడ్డా

కూలి పని కోసం ఎదురుచూపులు | **దొరికితే మస్తు.. లేకపోతే పస్తు!**

బాల భానుడికంటే ముందే వీధిలోకొచ్చిన స్వేదపు మనుషులు వారంతా. ఏదైనా వాహనమొచ్చి ఆగితే.. ఆశగా గుమిగూడతారు. నిత్యం ఆకలిని గెలిచేందుకు అడ్డా మీద నిలబడతారు. ఎంతకో కొంతకు రోజువారీగా శ్రమను అమ్ముకుంటారు. అదీ కొనేవాళ్లు లేకపోతే నిరాశతో వెనుదిరుగుతారు. కూలి కోసం నిత్యం వందలాది మంది సోమిడి రోడ్డులో వేచి చూస్తూనే ఉంటారు. నగరంలోని అడ్డామీది కూలీల బతుకులపై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ.


సోమిడి రోడ్డులో పనుల కోసం వేచి ఉన్న కూలీలు

కాజీపేట: రోజువారీ కూలీలకు కేరాఫ్.. కాజీపేటలోని సోమిడి రోడ్డు. హనుమకొండ రెవెన్యూ డివిజన్ పరిధి వివిధ ప్రాంతాల నుంచి రోజూ ఉపాధి పనుల కోసం ఇక్కడికి 300 వందల మందికి పైగా కూలీలు వస్తుంటారు. స్టేషన్‌ఘన్‌పూర్, ధర్మసాగర్, హనుమకొండ, హసన్‌పర్తి తదితర ప్రాంతాల నుంచి నిత్యం ఉదయం కూలీలు సోమిడి రోడ్డుకు చేరుకుంటారు. క్యారేజీలు పట్టుకుని పని కోసం ఎదురు చూస్తారు. భవన నిర్మాణ పనులు, ఇళ్లు పగలగొట్టడం, గ్రానైట్ డిజైన్ ఇలా ఎంతటి కష్టమైన పనికైనా వెళ్తారు.

పోటీ వాతావరణమే..

ఒకప్పుడు సోమిడి రోడ్డులోని అడ్డాకు తక్కువ మంది కూలీలు వచ్చేవారు. దీంతో అందరికీ పని దొరికేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి అనేక మంది కూలీలు పనుల కోసం పట్టణానికి వలస వస్తుండడంతో అందరికి పని లభించడం కష్టంగా మారింది. దీంతో చేసేది లేక పని ఇప్పించే మేస్త్రీలను ఆకట్టుకునేందుకు కూలీ రేట్లు తగ్గించుకునేందుకు సిద్ధపడుతున్నారు. మేస్త్రీలు ఎవరైనా సోమిడిరోడ్డుకు చేరుకోగానే.. అక్కడున్న ముఠాల నాయకులు వచ్చి ఏ పని చేయాలి.. ఎంత మంది కార్మికులు కావాలని అడగాలి. ఎవరు ముందు అడిగితే వారికే పని దక్కే అవకాశం ఉండడంతో ప్రస్తుతం ఇక్కడ పోటీ వాతావరణం ఏర్పడింది.

నెలలో సగం రోజులే పని..

పని దొరికితే మస్తు.. లేకపోతే పస్తు అనే పరిస్థితి ఇక్కడి కూలీలది. పని లభ్యం కాని రోజుల్లో నిత్యావసర సరుకులు ఇంటికి తీసుకెళ్లలేక కూలీలు పడే వేదన వర్ణనాతీతం. గ్రామీణ వ్యవసాయ కూలీలు పనులు వెతుక్కుంటూ పట్టణానికి రావడంతో అందరికి పనులు దొరకడం గగనంగా మారింది. ఒక్కో కూలీకి నెలలో పదిహేను రోజులు కూడా.. పని దొరకని దుస్థితి. మిగతా రోజుల్లో ప్రయాణ చార్జీలను భరించి వచ్చి మధ్యాహ్నం దాకా ఎదురు చూస్తారు. పని దొరక్కపోతే కాళ్లీడ్చుకుంటూ ఇంటికి వెళ్లిపోతారు.

పనులు దొరక్క పస్తులు..



ఎక్కువ మంది కూలీలు అడ్డా మీదికి వస్తుండడంతో అందరికీ పనులు దొరకట్లేదు. పనులు దొరకని కొన్ని సందర్భాల్లో తక్కువ కూలీకైనా వెళ్లాల్సి వస్తోంది. పట్టణంతో పాటు శివారు గ్రామాల్లో పనులు లభించక కూలీలు పస్తుంలుడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యం అడ్డాపై పనుల కోసం ఎదురు చూపులు తప్పట్లేదు.

– సయ్యద్, మేస్త్రీ, కడిపికొండ

పని దొరికితే సంతోషం



గ్రామాల నుంచి పనుల కోసం కూలీలు పట్టణానికి వస్తున్నారు. దీంతో అడ్డామీద నిల్చున్న సగం మందికి కూడా పనులు దొరకట్లేదు. ఎవరైనా పిలిచి పనిస్తే పొద్దంతా కష్టపడి కూలీ డబ్బులతో సంతోషంగా ఇంటికి వెళ్తాం. మా బాధలు ఎప్పటికి తీరుతాయో.

– నాగవెళ్ల ధనలక్ష్మి, కూలీ, కాజీపేట

కనీస వసతులు కల్పించాలి..



రోజూ ఎంతో ఖర్చు పెట్టుకుని నగరానికి పనుల కోసం ఎంతోమంది ఆశతో వస్తుంటారు. పని దొరికితే సంతోషంగా ఇంటికి వెళ్తారు. పని లేకపోతే తోటి కూలీల వద్ద అప్పు చేసి ఇంటికి వెళ్తారు. వీరికి అడ్డాపై కనీస వసతులు కల్పించాలని ఎమ్మెల్యేకు విన్నవించాం.

– తేలు సారంగపాణి, కార్మిక సంఘం నాయకుడు

ప్రజాకవి కాళోజీ జీవితం ఆదర్శనీయం

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


కాళోజీ డాక్యుమెంటరీ ఆవిష్కరణలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల : ప్రజాకవి కాళోజీ నారాయణరావు జీవితం ఆదర్శనీయమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం కాళోజీ జయంతిని పురస్కరించుకుని వరంగల్‌కు చెందిన సినీ దర్శకుడు ప్రభాకర్ జైనీ నిర్మించిన కాళోజీ డాక్యుమెంటరీని హైదరాబాద్‌లో ఆవిష్కరించి తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ కాళోజీ ప్రజా జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. ఆ మహనీయుడి ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తున్నారన్నారు. భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా డాక్యుమెంటరీ అందించిన ప్రభాకర్ జైనీని అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మండల నాయకులు పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు పెంచాలి

- సేవాలాల్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోతు రాంబాబు


సభలో నినాదాలు చేస్తున్న గిరిజన సంఘాల నేతలు

జనగామ రూరల్ : అన్ని రంగాల్లో గిరిజనులు వెనుకబడి ఉన్నారని 12 శాతం రిజర్వేషన్లు పెంచి అమలు చేయాలని సేవాలాల్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సేవాలాల్ సేనా 9వ ఆవిర్భావ సభ పట్టణంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. అంతకు ముందు జనగామ చౌరస్తా నుంచి ఎస్ఎంఆర్ గార్డెన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ గిరిజన భాషకు లిపి ఏర్పాటు చేయాలని 76 ఏళ్లు దాటుతున్నా స్థితిగతులు ఏమి మారలేదన్నారు. పోరాట యోధుడు జాటోత్‌నాయక్ విగ్రహాన్ని జిల్లాలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల్లో మినీ ఐటీడీఏలు, కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి, గిరిజనబంధు, ఇండ్లు లేని పేదలకు డబుల్‌బెడ్ రూంలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చినబాబు, ప్రొఫెసర్ రాజారాం, ఎస్పీ నాయక్, మూడావత్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై పోరాడిన కాళోజీ

- ఎన్పీడీసీఎల్ సీఎండీ. గోపాల్‌రావు


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ: సామాజిక సమస్యలపై పోరాడిన వ్యక్తి ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ముందుగా కాళోజీ చిత్రపటానికి సీఎండీ గోపాల్‌రావు, డైరెక్టర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ తెలంగాణ బాస, యాసలోనే జీవన విధానం ఉందని, మాండలిక భాష గొప్పదనాన్ని చాటిన ప్రజాకవి కాళోజీ అని అన్నారు. నా గొడవ పేరిట సమకాలిన సామాజిక సమస్యలపై నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా అక్షరాయుధాలను సంధిస్తూ ప్రజల మనిషిగా కీర్తి గడించారన్నారు. 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ పొందారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో కనబడతాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, డైరెక్టర్ పి.మోహన్‌రెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్‌లాల్, రాజు చౌహాన్, ప్రభాకర్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ కె.రమేష్, కంపెనీ కార్యదర్శి కె. వెంకటేశం, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వీసీ, రిజిస్ట్రార్‌ను బర్తరఫ్ చేయాలి

- కేయూ విద్యార్థి జేఏసీ డిమాండ్


దీక్ష శిబిరంలో బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కేయూ క్యాంపస్ : పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని ప్రశ్నించిన విద్యార్థులపై కేసులు పెట్టించి పోలీసులచే దాడి చేయించిన వీసీ, రిజిస్ట్రార్‌ను తక్షణమే బర్తరఫ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ జేఏసీ డిమాండ్ చేసింది. వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం క్యాంపస్‌లోని దూరవిద్యాకేంద్రం ఆవరణలో నిరసన దీక్షలు చేపట్టారు. దీక్షల శిబిరాన్ని బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సందర్శించి సంఘీభావం తెలిపారు. విద్యార్థులను పరామర్శించి అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులచే దాడులు చేయించి కొట్టించడం వీసీ దుర్మార్గపు చర్య అన్నారు. స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ విద్యార్థులను పరామర్శించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో యూనివర్సిటీ విద్యార్థుల పాత్ర ఎంతో ఉందన్నారు. అలాంటి విద్యార్థులపై ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వీసీ రమేష్‌లు పోలీసులచే కొట్టించడం శోచనీయమన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీఉల్లాఖాద్రి, విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ తిరుపతి యాదవ్, గాయపడిన విద్యార్థులు మాచర్ల రాంబాబు, ఆరెగంటి నాగరాజు, అంకిళ్ల శంకర్, మట్టెడ కుమార్, జాక్ బాధ్యులు మేడ రంజిత్‌కుమార్, కన్నం సునీల్, గుగులోతు రాజు, మొగిలి వెంకటరెడ్డి, ప్రేమసుందర్, సోల్తికిరణ్‌గౌడ్, పల్లంకొండ సతీష్, ఎండీ. పాషా, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి వెండి దీపం బహూకరణ


వెండి గండుదీపాన్ని బహూకరిస్తున్న భక్తులు

కురవి: భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారికి వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన దొనికెన రేఖ,రాజేందర్‌గౌడ్ అనే భక్తులు అర కిలో వెండితో తయారు చేసిన గండు వెండి దీపాన్ని శనివారం బహూకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్ర త్యేక పూజలు చేశారు. శ్రీ వీరభద్ర స్వామి గర్భగుడిలో నిత్యం వెలిగే గండు వెండిదీపాన్ని ఆలయ అర్చకులు, అధికారులకు అందచేశారు.

సమాజ అభ్యున్నతికి కృషి

- తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ డైరెక్టర్ విష్ణుదాస్ శ్రీకాంత్


విష్ణుదాస్ శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు, బ్రాహ్మణ సంఘాల నాయకులు

హన్మకొండ కల్చరల్ : బ్రాహ్మణ సమాజం అభ్యున్నతి కోసం అంకితభావంతో కృషి చేస్తానని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ డైరెక్టర్ విష్ణుదాస్ శ్రీకాంత్ అన్నారు. సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌లో డైరెక్టర్‌గా చల్లగరిగె గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ విష్ణుదాస్ శ్రీకాంత్‌ను నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ భువనేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆయనను సన్మానించారు. శనివారం హనుమకొండ రాంనగర్‌లోని భువనేశ్వరి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారి తనకు బ్రాహ్మణ సమాజానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ మోత్కూరు రాము మాట్లాడుతూ పరిషత్ డైరెక్టర్‌గా శ్రీకాంత్‌ను నియమించడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధానకార్యదర్శి పద్మజ, కోశాధికారి విధుమౌళి, బీఆర్ఎస్ నాయకులు వద్దిరాజు గణేష్, తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్‌శర్మ, మహిళా అధ్యక్షురాలు దేవులపల్లి వాణి, మోత్కూర్ మనోహర్‌రావు, బ్రాహ్మణ సంఘాల నాయకులు, జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

ఎల్బీ కళాశాలలో 'పునీత్ సాగర్'



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

రామన్నపేట: జీ-20 శిఖరాగ్ర సమావేశ ఉత్సవాల్లో భాగంగా వరంగల్ ఎన్‌సీసీ గ్రూపు సూచనల మేరకు తెలంగాణ బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఎల్బీ కళాశాలలో శనివారం పునీత్ సాగర్ కార్యక్రమం నిర్వహించారు. పలు కళాశాల నుంచి వచ్చిన 200 మంది ఎన్‌సీసీ కేడెట్లు.. పరిసరాల పరిశుభ్రంపై ఎల్బీ కళాశాల నుంచి ములుగు క్రాస్‌రోడ్డు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సే నో ప్లాస్టిక్‌పై సందేశాత్మక పోటీలు, వ్యాసరచన పోటీలు, పోస్టర్ తయారీ, జీ -20 సదస్సుపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కేడెట్లకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ సమ్రాజుద్దీన్ పురస్కారాలు అందజేశారు. కార్యకమంలో ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి రాజేష్ కౌశిక్, ఏఓ రేవతి, ప్రభాకరన్, చేత్ మానా తాపా, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం ఆస్పత్రికి కరెంట్ కష్టాలు

- నిలిచిన పలు నిర్ధారణ పరీక్షలు
- పట్టించుకోని పరిపాలనాధికారులు
- ఓపీ రోగులతో పాటు ఇన్‌పేషెంట్లకు సైతం తప్పని తిప్పలు



ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు వచ్చే రోగులకు కరెంట్ కష్టాలు తప్పలేదు. నగర పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ క్రమంలో ఆస్పత్రికి సైతం కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో రోగులకు తిప్పలు తప్పలేదు. ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ఓపీ వేళలు ఉంటాయి. ఈ సమయంలో ఆస్పత్రిలో చికిత్సల నిమిత్తం ఓపీ విభాగానికి వేల సంఖ్యలో రోగులు వస్తుంటారు. వారికి స్కానింగ్, ఎక్స్‌రే, రక్తనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ పూర్తిస్థాయిలో వైద్యం అందించాల్సి ఉంటుంది. అంతేకాకుండా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అసలే ఇరుకు గదుల్లో తీవ్ర ఉక్కపోతలో రోగులు అరకొర చికిత్సలు పొందాల్సిన దుస్థితి నెలకొంది. ఎంజీఎంలో అందుబాటులో జనరేటర్ల ద్వారా అత్యవసర వార్డులకు మాత్రమే కరెంట్ సరఫరా అవుతుంది. పూర్తిస్థాయిలో ఎక్స్‌రే, స్కానింగ్ వంటి పరికరాలకు జనరేటర్ సేవలు లేకపోవడంతో వాటితో సేవలు అందకపోవడంతో రోగులు వెనుదిరగక తప్పలేదు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంలో పరిపాలనాధికారుల నిర్లక్ష్యంపై రోగులు మండిపడుతున్నారు.

ఎక్స్‌రే కోసం నిరీక్షిస్తున్నాం..



బండిపై నుంచి జారిపడి చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి వచ్చాం. ఎక్స్‌రే చేయాలని డాక్టర్లు పేర్కొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం కరెంట్ లేకపోవడంతో గంటల తరబడి ఎక్స్‌రే కోసం నిరీక్షిస్తున్నాం. ఇలా ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. పదుల సంఖ్యలో రోగులు వివిధ నిర్ధారణ పరీక్షల కోసం వేచి చూసి వెనుదిరగక తప్పలేదు.

– సంపత్, కన్నారం

వర్తక సంఘానికి ఎన్నికలు జరిగేనా ?

- నాలుగేళ్లు పూర్తి చేసుకున్న పాలకవర్గ కమిటీ
- బైలా ప్రకారం ప్రతి రెండేళ్లకు నిర్వహించాలి
- టెండర్ల నిర్వహణపై అసంతృప్తి
- లెక్కలు చెప్పాలని కూరగాయల వ్యాపారుల డిమాండ్



లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ ప్రధాన ద్వారం

వరంగల్: వరంగల్ జిల్లా కూరగాయల కమీషన్ వ్యాపారుల వర్తక సంఘం కార్యవర్గం ఏర్పడి కరోనా కాలంతో కలుపుకుని నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంపై వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంఘం బైలా ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి కొత్త కార్యవర్గం ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. 2020లో ప్రస్తుత కార్యవర్గం ఏర్పడింది. తర్వాత కరోనా ప్రభావం ఉండడంతో రెండేళ్లు గడిచిన తర్వాత మరో రెండేళ్లు పూర్తయిన వెంటనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రస్తుత కార్యవర్గం చెప్పడంతో వ్యాపారులు గడువు కోసం ఎదురు చూశారు. గడువు పూర్తయి ఆరునెలలు దాటినా సంఘంలోని పలువురు వ్యాపారులు ఎన్నికలు నిర్వహించాలని కోరగా మరింత సమయం కావాలని చెబుతూ దాట వేస్తున్నారని తెలిపారు. గత ఏడాది వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం టెండర్ నిర్వహించగా రూ.4.05 లక్షలు ఆదాయం సమకూరింది. ఉత్సవాలు పూర్తయిన వెంటనే దానికి సంబంధించిన లెక్కలు కమిటీ ముందు పెట్టాల్సి ఉన్నా నేటి వరకు పట్టించుకోవడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఈసారి నిర్వహించనున్న వినాయకుని నవరాత్రి ఉత్సవాల కోసం ఈనెల 6న టెండర్ నిర్వహించగా రూ.4.78 లక్షలు ఆదాయం వచ్చింది. సంఘానికి ఎన్నికలు నిర్వహించకుండా పాత కమిటీ మళ్లీ టెండర్ నిర్వహించడం, గత సంవత్సరం లెక్కలు చెప్పక పోవడంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నవరాత్రులకు ముందుగానే సంఘానికి ఎన్నికలు నిర్వహించి ఆదాయ, వ్యయ వివరాలను సభ్యులకు వివరించి నిల్వ ఉన్న డబ్బులను కొత్త కమిటీకి అప్పగించాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. ఈసారి ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా బ్యాలెట్‌తో నిర్వహించాలని వ్యాపారులు కోరుతున్నారు.

టెండర్ డబ్బులకు లెక్కలు చెప్పాలి



వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం గత ఏడాది టెండర్ ద్వారా వచ్చిన డబ్బులకు లెక్కలు చెప్పాలి. సంఘానికి సమకూరిన ఆదాయం...వ్యయాన్ని సభ్యులందరికీ వివరించాలి. కొత్త కమిటీ కోసం ఎన్నికలను నిర్వహించాలి.

– శిరబోయిన అమర్, వ్యాపారి

బ్యాలెట్ ద్వారా ఎన్నిక జరగాలి



నిబంధనల ప్రకారం రెండేళ్లు పూర్తి కాగానే ఎన్నికలు నిర్వహించాలి. అయినా ఎన్నికలు నిర్వహించడం లేదు. చేతులెత్తే కమిటీని ఏర్పాటు చేయకుండా ఎన్నికలను ప్రజాస్వామ్యం పద్ధతిలో బ్యాలెట్ ద్వారా నిర్వహించాలి.

– సుంచుకాల రవీందర్‌రావు, వ్యాపారి

డ్రాగన్ ఫ్రూట్ క్షేత్రాల సందర్శన


మాట్లాడుతున్న చత్రునాయక్

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మల్యాల (దేశి) డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఇన్పుట్ డీలర్ గ్రూప్ సభ్యులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చత్రునాయక్ మరిపెడ మండలం లచ్చతండా సమీపంలో డ్రాగన్ ఫ్రూట్ క్షేత్రాలు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చత్రునాయక్ మాట్లాడుతూ జిల్లాలో పెరుగుతున్న నైపుణ్యం రైతులకు తెలియజేయాలన్నారు. డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్‌లో చాలా డిమాండ్ ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో కురవి మండల వ్యవసాయ శాఖ అధికారి మంజుఖాన్, రిటైర్డ్ దామోదర్‌రెడ్డి, అనుమాల రాంరెడ్డి, దేశి డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ చేయకపోతే మాదిగల శత్రువుగా బీజేపీ


దీక్షను ప్రారంభిస్తున్న జన్ను దినేష్ మాదిగ, మంద చిన్నరాజు మాదిగ

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకపోతే మాదిగల శత్రువుగా బీజేపీ మిగిలిపోతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద చిన్నరాజు హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. దీక్షలను వారు ప్రారంభించి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని మాదిగలకు బీజేపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ ద్వారానే మాదిగలకు, ఉపకులాలకు భవిష్యత్ ఉంటుందన్నారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ, కట్ల రాజశేఖర్ మాదిగ, నాయకులు గంగారపు శ్రీనివాస్, రాజారపు భిక్షపతి, చేతల్ల శివ, తడుగుల విజయ్, శాంతిసాగర్, అంకిల్ల రాజు, మధుకర్, రమేష్, రాజు, పూర్ణయ్య, నిరంజన్, మురళి, సంపత్, తదితరులు పాల్గొన్నారు.